

బ్యాటింగ్ జోరు.. బౌలింగ్ హుషారు..

కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాలు వేదికగా సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఉత్సాహంగా సాగుతోంది. -18లో..

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దండి



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీరిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జేసీ సాయి కాంత్‌వర్మ పేర్కొన్నారు. -18లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/16.9

జిల్లాలో బుధవారం 16.9 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఇంటర్ ఆర్‌జేడీగా రవి బాధ్యతల స్వీకరణ



కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా రవి బుధవారం కడప ఆర్‌జేడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్ఐఓగా పనిచేస్తున్న ఆయనను ఇంటర్‌బోర్డు ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఇంటర్ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో వెలుగుచూసిన మరో శాసనం



తిమ్మారెడ్డిపల్లె గ్రామం వెలుపల పొలాలలో లభించిన శాసనం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాలో మరో శాసనం వెలుగు చూసింది. జిల్లాకు చెందిన తిమ్మారెడ్డిపల్లె గ్రామం వెలుపల పొలాలలో అక్షరాలు గల ఈ రాతి బండను కనుగొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం హెచ్‌ఆర్ శాఖ పరిశోధక విద్యార్థులు ప్రొఫెసర్ ఆచార్య కె.గంగయ్య ఆధ్వర్యంలో స్థానిక యువకుడు పవన్ ఆధ్వర్యంలో ఈ శాసనాన్ని కనుగొన్నారు. ఇందులో తెలుగు అక్షరాలు ఉన్నాయని, ఇది దాన శాసనమని పరిశోధకులు తెలిపారు.

కల్తీకి కళ్లెం

- అన్నదాతలకు అండగా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్
- నాణ్యతపై రైతన్నలకు భరోసా
- వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలే లక్ష్యంగా అడుగులు
- రైతులకు సరఫరా చేసే, ఎరువులు, విత్తనాలకు పరీక్ష తప్పనిసరి



మైదుకూరులో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్

కడప అగ్రికల్చర్: విత్తు బాగుంటే పంట బాగుంటుంది. పంట బాగుంటే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. నాణ్యమైన దిగుబడులు వస్తే ధరలు బాగుంటాయి. ఇవన్నీ బాగుంటే రైతు సుభిక్షంగా ఉంటాడు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. రైతులకు అతి ముఖ్యంగా అవసరమైన విత్తనాలతోపాటు ఎరువులు, పురుగుమందుల నాణ్యతను కాపాడితే రైతు అన్ని రకాల అభివృద్ధి చెందుతాడనే లక్ష్యంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి అన్నదాతకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి కాలు కదపకుండా ఉన్న ఊర్లోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తోంది. దీంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వ్యవసాయం పండుగ చేయడమే లక్ష్యంగా...

వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు రకాల పథకాలను చేపట్టింది. ఇందులో భాగంగా దేశంలో తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభించేలా వైఎస్సార్ అగ్రిల్యాబ్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసి రైతులకు సేవలందించనున్నారు. ఇందులో భాగంగా మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, కమలాపురంలలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాల పరీక్షలను నిర్వహిస్తూ సేవలను ప్రారంభించారు. ముద్దనూరులో మాత్రం ల్యాబ్ బిల్డింగ్ పనులను పూర్తి చేసింది. త్వరలో దీనిని ప్రారంభించి సేవలందించనున్నారు. అలాగే కడపలో ఏర్పాటు చేసే డిస్ట్రిక్ ల్యాబ్‌కు సంబంధించిన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో దీనిని కూడా ప్రారంభించనున్నారు. జిల్లా ల్యాబ్ ప్రారంభమైతే ఎరువులు, విత్తనాలతోపాటు పురుగు మందులను కూడా పరీక్షించనున్నారు.

ధైర్యంగా సాగు చేపట్టేలా..

మార్కెట్‌లోకి వచ్చే ప్రతి ఇన్‌పుట్ శ్యాంపిల్‌ను ఇక్కడ పరీక్షించుకునే వెసులుబాటు ఉండటంతో రైతుల్లో సాగుపై మరింత విశ్వాసం పెరిగింది. గతంలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు వాడి ఎంతో మంది రైతులు ఆర్థికంగా నష్టపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనమైనా లేదా మార్కెట్‌లో కొనుగోలు చేసిన విత్తనమైనా నేరుగా ఈ ల్యాబ్‌కు వెళ్లి విత్తన నాణ్యతలను ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనమే కాకుండా ఎరువులు, పురుగుమందుల నాణ్యతను కూడా పరీక్షించుకోవచ్చు.

మూడు వితదల్లో పరీక్షలు...

నకిలీలు, నాసిరకాలు నిరోధించి అర్హత లేని వ్యాపారుల నుంచి కాపాడేందుకు అగ్రి ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ ల్యాబుల్లో మూడు దశల్లో విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను పరీక్షిస్తారు. ఆ తరువాత మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. మార్కెట్‌లోకి విడుదలైన వాటిని జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ ల్యాబుల్లో అన్ని పరీక్షలను నిర్వహించి నాణ్యత సంతృప్తికరంగా ఉంటే సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. నాణ్యత లోపించిన వాటిపై రైతులు కోర్టులో కేసులు వేసేందుకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి.

నాలుగు రకాల నమూనా పరీక్షలు..

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో రసాయనిక ఎరువులు, విత్తనాలకు సంబంధించి నాలుగు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో మొదటి యాక్ట్ శాంపిల్ రాష్ట్ర స్థాయిలో సేకరించి పంపుతారు. వీటిని పరీక్షించి నివేదికలు రాష్ట్రస్థాయి అధికారులకు పంపుతారు.

రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానం...

నియోజకవర్గ స్థాయిలో ల్యాబ్‌లలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు తదితర వాటి నమూనాలను ఎలాంటి రుసుం లేకుండా ల్యాబ్ టెక్నికల్ అనలిస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించి ధ్రువీకరిస్తారు. ఆర్‌బీకేల ద్వారా రాయితీపై అందజేసే వాటిని కూడా క్షుణ్ణంగా పరీక్షించి అన్నీ సవ్యంగా ఉన్నాయంటేనే మార్కెట్‌లోకి విడుదల చేసి రైతులకు అందజేస్తారు. ల్యాబ్‌లో విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి జాతీయ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌ను దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానం చేశారు. ఇన్‌పుట్స్ పరీక్షించుకునేలా ఆర్‌బీకే సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

ల్యాబ్‌ల వారీగా విశ్లేషణ చేసిన నమూనా వివరాలు

ల్యాబ్‌పేరు	సంచిత లక్ష్యం	విత్తనాలు	ఎరువులు	పరీక్షలు చేసినవి	శాతం
పులివెందుల	1000	481	232	713	71
బద్వేల్	1000	538	82	620	62
కమలాపురం	1000	540	74	614	61
మైదుకూరు	1000	506	74	580	58
ప్రొద్దుటూరు	1000	500	76	576	50
మొత్తం	5000	2565	538	3103	62



విత్తన పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది

ల్యాబ్‌లలో సేవలను ప్రారంభించాం



జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిల్యాబ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ప్రస్తుతం ఐదు నియోజకవర్గాల అగ్రిల్యాబ్స్ నిర్మాణ పనులు పూర్తయి ఎరువులు, విత్తనాలకు సంబంధించిన పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇక మిగిలిన ఒక ల్యాబ్‌ను ముద్దనూరులో ఏర్పాటు చేయనున్నారు. త్వరలో ఈ ల్యాబ్‌ను కూడా ప్రారంభించనున్నారు. జిల్లా ల్యాబ్‌కు సంబంధించి కడపలో పనులు జరుగుతున్నాయి. వీటి పనులను కూడా త్వరలోనే ముగించి సేవలను ప్రారంభిస్తాము. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

కడప విమానాశ్రయం రన్‌వే వెడల్పుకు కేంద్రం సమ్మతి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి లేఖ ద్వారా తెలిపిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కడప విమానాశ్రయంలో విమానాల నైట్ ల్యాండింగ్ కోసం, రన్‌వే వెడల్పు, ఆర్ఈఎస్ఏ, పీపీపీఏ తదితర వాటి పనులకు సంబంధించి సమ్మతిస్తూ భారత పౌర విమానయాన,ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి లేఖ ద్వారా తెలియజేశారు. కడప విమానాశ్రయంలో విమానాల నైట్ ల్యాండింగ్ కోసం అనుమతి కోరుతూ గత ఏడాది డిసెంబర్ 8వ తేదీన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భారత పౌర విమానయాన,ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రికి లేఖ రాశారు. దీనికి స్పందించి డీజీసీఏ బృందం గత ఏడాది డిసెంబర్ 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తనిఖీ చేసింది. యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) డాక్యుమెంట్లను పరిశీలించిన డీజీసీఏ కడప విమానాశ్రయం రన్‌వే వెడల్పు, ఆర్ఈఎస్ఏ, పీపీపీఏ తదితర వాటికి సంబంధించి సమ్మతిని కడప విమానాశ్రయానికి తెలియజేసిందన్నారు. ప్రయాణికుల నిర్వహణకు అనువైన కొత్త టెర్మినల్ భవనం మంజూరుకు సంబంధించి కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ డిపార్చర్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, అందుకు అనుబంధంగా చేపట్టే పనుల విషయంలో చొరవ చూపడం అభినందనీయమన్నారు. అందుకు సంబంధించి భూమి, లభ్యత, కమర్షియల్ అనుకూలత, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ద్వారా సంబంధిత పనులను నిర్వహించుకోవచ్చని లేఖ ద్వారా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వివరించారు.

పింఛన్ అందెను.. ఆనందం నిండెను

- మొత్తం 2,55,866 మందికి పింఛన్లు
- రూ.70.61 కోట్లకు పైగా పంపిణీ

కడప రూరల్: ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా పింఛన్ల పండుగ జరుగుతోంది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లాలో బుధవారం వలంటీర్ల ద్వారా పింఛన్ల నగదు పంపిణీ జరిగింది. మొత్తం 2,55,866 పింఛన్లకు గాను రూ.70,61,36,250 నగదును అందజేయాలి. సాయంత్రం 5 గంటల ప్రాంతానికే 2,05,812 మందికి రూ. 56,82,79,000 పంపిణీ చేశారు. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్లు ఇంటింటికీ వెళ్లారు. అవ్వాతాతలు ఇతర కేటగిరీలకు చెందిన వారికి పింఛన్ల నగదును అందజేశారు. తెల్లారకముందే పింఛన్ చేతికి రావడం పట్ల పండుటాకులు పింఛనానందం పొందుతున్నారు.

నా మనవడు జగనయ్య చల్లగా ఉండాలమ్మా..



ఇక్కడ కనిపిస్తున్న వృద్ధురాలి పేరు జె.చంద్రమ్మ. జమ్మలమడుగు నియోజకవర్గం, వేమగుంట గ్రామం. ఆ ప్రాంత వలంటీర్ మానస వేకువజామునే వెళ్లి చంద్రమ్మను పలకరించింది. కుశల ప్రశ్నలు వేసింది. అనంతరం పింఛన్ నగదును అందజేసింది. దీంతో చంద్రమ్మ వలంటీర్ వైపు ఆప్యాయంగా చూసింది. నా మనవడు జగనయ్య చల్లంగుండాలమ్మా, మీ ద్వారా మా లాంటి వారి కోసం ఇంటి వద్దకే పింఛన్‌ను పంపిస్తున్నారు. ఇంతకుముందైతే ఈ లెక్క కోసం ఎక్కడెక్కడికో వెళ్లి నీరసించిపోయేవాళ్లం. మా జగనయ్య వచ్చాక ఆ శ్రమ తప్పిందని సంతోషం వ్యక్తం చేసింది.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు ఖాదర్‌బాషా. వైఎస్సార్ జిల్లా కడప నగరం, రవీంద్రనగర్ వాసి. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ రాజు వెళ్లి వృద్ధాప్య పింఛన్ నగదును అందజేశారు. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం



పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా కొన్ని అంశాలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరీ ముఖ్యంగా రాయలసీమకు తీరని అన్యాయం చేసే విధంగా బడ్జెట్ ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. వేతన జీవులకు కాస్త ఊరట లభించినా.. మిగిలిన అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్‌పై వివిధ వర్గాల వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. – సాక్షినెట్‌వర్క్

రాష్ట్రానికి అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు తెలిపారు. విభజన హామీ మేరకు ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక నిధులు ఇచ్చే అంశాన్ని విస్మరించారన్నారు. ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించారన్నారు. ఈ బడ్జెట్ వల్ల పేద వర్గాలకు ఎలాంటి మేలు చేకూరదని తెలిపారు.

మధ్యతరగతి ప్రజలకు మిగిలేది శూన్యం

కేంద్ర బడ్జెట్ వల్ల మధ్య తరగతి ప్రజలకు మిగిలేది శూన్యమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ. రఘునాథరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తాను అనుకున్న స్టాక్ మార్కెట్ అనుకూల అజెండాను అమలు చేసింది తప్పా ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించలేదన్నారు. ప్రతి బడ్జెట్‌లోనూ కార్పొరేట్లకు రాయితీలు అందుతాయని, మౌలిక సదుపాయాల రంగాలకు నిధులందక దేశం నష్టపోతుందని తెలిపారు.

కార్మికులు, నిరుద్యోగులకు నిరాశ



కేంద్ర బడ్జెట్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పేద గ్రామీణ కార్మికులు, నిరుద్యోగులకు ఉపాధి, ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావన లేకపోవడం, కార్మిక, నిరుద్యోగ, శ్రామికులకు నిరాశ కలిగించింది. మౌలిక సదుపాయాలు, పెట్టుబడి, సంభావ్యత, హరితవృద్ధి, యువశక్తి, ఆర్థికరంగాన్ని ఆవిష్కరించడం అనే ఏడు ప్రాధాన్యతలను బడ్జెట్ లక్ష్యంగా నిర్దేశించడం అభినందనీయం. – ఆచార్య బాయినేని శ్రీనివాస్, ఆర్థికశాస్త్ర ఆచార్యులు, వైవీయూ

వేతన జీవులకు ఊరటే



కేంద్రప్రభుత్వం ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్నుల విషయంలో కాస్త ఊరట కల్పించినప్పటికీ వారికి ఆదాయ సముపార్జన మార్గాలవైపు బడ్జెట్ కేటాయించి ఉంటే బాగుండేది. పీఎం కౌశల్ పథకంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ల కోసం బడ్జెట్ కేటాయింపులు అభినందనీయం. మహిళా సమ్మాన్ బచత్ పథకం ద్వారా పొదుపు పథకం ప్రారంభించడం అభినందనీయం. – డాక్టర్ రమేష్ పిచ్చాయ్, ఆర్థికశాస్త్ర పరిశోధకుడు, కడప

పన్ను మినహాయింపు హర్షణీయం



కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం హర్షణీయం. ఉద్యోగుల సంక్షేమం కోసం కేవలం పన్ను మినహాయింపు మాత్రమే సరిపోదు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తే వారికి మేలు జరుగుతుంది. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద రూ..79వేల కోట్లు కేటాయించిన సందర్భంగా ప్రైవేటు ఉపాధ్యాయలకు ప్రత్యేక కాలనీలు నిర్మించాలి. – ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

రాష్ట్రానికి తీరని అన్యాయం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. విభజన చట్టంలో 13వ షెడ్యూల్‌లో ఉన్న కడప ఉక్కు, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విద్య, వైద్య సంస్థలకు నిధులు కేటాయించకపోవడం దారుణం. ఇది ప్రజల బడ్జెట్ కాదు. బీజేపీ ప్రాంతాల బడ్జెట్. –గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

అప్పుల బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పుల బడ్జెట్‌గా ఉంది. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయలేని బడ్జెట్‌గా ఉంది. వ్యవసాయమే ప్రధానంగా ఉన్న భారతదేశానికి ఈ రోజు వ్యవసాయ రంగానికి తక్కువ బడ్జెట్ శోచనీయం. నిరుద్యోగులకు ఉపాధి చూపలేని మోడీ బడ్జెట్. –నీలి శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

జేఎన్‌టీయూ ప్రిన్సిపల్‌గా వసుంధర



పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్‌టీయూ ప్రిన్సిపల్‌గా వసుంధర బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక జేఎన్‌టీయూలో సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ వసుంధరకు వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వేలం ద్వారా పాత వాహనాలు అమ్మకం

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పాత వాహనాలను ఈ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. 18 పనిచేయని వాహనాలు అమ్మకానికి ఉన్నాయన్నారు. ఈ నెల 14వ తేదీన ఈ వేలం ద్వారా అమ్మకానికి నిర్ణయించామని పేర్కొన్నారు.

రేపటి నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెలివరీస్ ఆడిట్

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈనెల 3నుంచి 10 వరకు డెలివరీస్ ఆడిట్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆ శాఖ కార్యాలయంలో సీ–సెక్షన్ డెలివరీస్ ఆడిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు సీ–సెక్షన్ డెలివరీలు 54 శాతం జరిగాయన్నారు. డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, మల్లీశ్వరి , ఉమాపతి ,రమణమ్మ పాల్గొన్నారు.

కడపలో యువకుడి దారుణ హత్య





రేవంత్ మృతదేహం (ఇన్‌సెట్) ఫైల్ ఫొటో



రేవంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

కడప అర్బన్: కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో రఘు బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పేటా రేవంత్ (27) అనే యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో రేవంత్ స్నేహితుడు అభిలాష్(25) తీవ్రంగా గాయపడ్డాడు. ఈసంఘటనపై పోలీసులు, బంధువులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన పేటా నాగరాజు రెండో కుమారుడు పేటా రేవంత్ (27) జోన్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అక్కడి నుంచి గత రాత్రి కడపకు వచ్చాడు. బుధవారం రాత్రి తన స్నేహితుడు, సీయోన్‌పురానికి చెందిన అభిలాష్‌తో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. అక్కడికి రేవంత్‌తో మనస్పర్థలు కలిగిన గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు. రేవంత్, అభిలాష్‌పై కత్తులతో దాడి చేశారు. రేవంత్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తీవ్రంగా గాయపడిన అభిలాష్‌ను

మరొకరికి తీవ్రగాయాలు



గాయపడిన అభిలాష్

సీఐ ఎస్.వి నాగరాజు, తమ సిబ్బందితో కలిసి తమ వాహనంలోనే రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం అభిలాష్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, వన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, కమాండ్ కంట్రోల్ సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రేవంత్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు విలపించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. హంతకులకోసం పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.వి నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రేవంత్‌పై కడపలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై, దర్యాప్తులో ఉన్నాయని సమాచారం.



క్లుప్తంగా

అయ్యో పాపం..

- గర్భం దాల్చిన పదిహేనేళ్ల బాలిక
- ఇద్దరిపై కేసు నమోదు

జమ్మలమడుగు : పదిహేనేళ్ల బాలిక గర్భం దాల్చిన సంఘటన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం సలివెందుల గ్రామంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సదా శివయ్య బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు జమ్మలమడుగు మండలం సలివెందుల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, నరసమ్మలు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. సుబ్బరాయుడు, నరసమ్మల మధ్య మనస్పర్థలు రావడంతో సంవత్సరం కిందట విడిపోయారు. దీంతో కుమారుడిని తీసుకుని తల్లి వెళ్లిపోయింది. వీరి మరో కుమార్తె సలివెందుల గ్రామంలోనే వరుసకు అవ్వ అయిన వారి ఇంట్లో ఉంటోంది. గ్రామంలోని ఓ టీ దుకాణంలో పనిచేస్తోంది.మానసిక స్థితి సరిగా ఉండేది కాదు. ముక్కుపచ్చలారని ఆ బాలికకు మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన 50 సంవత్సరాల వ్యక్తి, 35 ఏళ్ల మరో యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డారు. దీంతో బాలిక గర్భం దాల్చింది. తనకు కడుపు నొప్పిగా ఉందని విషయాన్ని తండ్రికి తెలిపింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించడంతో అసలు విషయం బయటపడింది. వైద్యులు పరీక్షలు జరుపగా 5 నెలల గర్భిణి అని తేలింది. దీంతో జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. బాలిక గుర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామం క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న 2వేల కిలోల, సుమారు 36 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోలను సీజ్ చేసినట్లు కలమల్ల ఎస్ఐ శివప్రసాద్ బుధవారం తెలిపారు.లోకినేని గంగయ్య, సాకే రాజులు ముదిగుబ్బకు తలరిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు.

178 కేసుల నమోదు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై మొత్తం 178 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 160 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహనచోదకులపై 18 కేసులు నమోదు చేశారు.

బ్యాటింగ్ జోరు.. బౌలింగ్ హుషారు..

ఉత్సాహంగా సాగుతున్న ఎస్‌పీఎల్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాలు వేదికగా నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఉత్సాహంగా సాగుతోంది. వివిధ కళాశాలల క్రీడాకారులు తమ బ్యాటింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ చూడ చక్కటి షాట్‌లతో అలరిస్తుండగా.. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే అవుట్‌చేయడంతో పాటు పరుగులు తీయకుండా ఉండేలా బౌలర్లు శ్రమిస్తున్నారు. బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి.


మ్యాచ్‌లో తలపడుతున్న జట్లు

SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

నేటి మ్యాచ్‌ల వివరాలు..

కేఎస్ఆర్ఎం మైదానంలో..

- **ఉదయం 9 గంటలకు :** బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల – ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల
- **ఉదయం 11 గంటలకు :** ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు – నిర్మల ఫార్మసి కళాశాల, కడప.

కేఓఆర్ఎం మైదానంలో..

- **ఉదయం 9 గంటలకు :** గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల,కడప – ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప.
- **ఉదయం 11 గంటలకు :** కె.ఎస్.ఆర్.ఎం. కడప – శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు, కడప.

'రాచపూడి'రాజసం..


బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–1లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, కడప కేఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రాచపూడి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కేఎస్ఆర్ఎం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. జట్టులోని జి. సుదర్శన్ 36 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు 8.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని శ్రీకర్ 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

పాలకొండ్రాయ జట్టుకు పది వికెట్ల విజయం..


ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–2లో ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–1 జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పాలకొండ్రాయ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. జట్టులోని గణేష్ 8 పరుగులు చేశాడు. పాలకొండ్రాయ బౌలర్ వెంకటసాయిరెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన పాలకొండ్రాయ జట్టు 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది. జట్టులోని వెంకటసాయిరెడ్డి 26 పరుగులుచేశాడు. దీంతో పాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ట్రిపుల్‌ఐటీ జట్టుకు విజయం..


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు

కేఎస్ఆర్ ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–3లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు, బద్వేలు ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన బద్వేలు ఎస్.బి.వి.ఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ట్రిపుల్‌ఐటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. జట్టులోని సాయికుమార్ 12 పరుగులు చేశాడు. ఎస్.బి.వి.ఆర్. బౌలర్ ఎస్.సాయి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బద్వేలు ఎస్.బి.వి.ఆర్. జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని ఎస్. సాయి 33 పరుగులు చేశాడు. ట్రిపుల్‌ఐటీ బౌలర్ పవన్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. దీంతో ట్రిపుల్‌ఐటీ జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది.

'గ్లోబల్'విజయం..


కడప గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–1లో గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల, కడప నిర్మల ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గ్లోబల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 104 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని అమర్‌నాథ్‌రెడ్డి 12 బంతుల్లో 34 పరుగులు చేశాడు. నిర్మల బౌలర్ కృష్ణ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిర్మల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 23 పరుగులు చేశాడు. గ్లోబల్ బౌలర్ రెడ్డి మహేష్ 2 వికెట్లు తీశాడు.గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఎస్.వి. డిగ్రీ కళాశాల విజయభేరి..


కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు

కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–2లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు, ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి. జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కుదిగిన ఎస్ఆర్ఐటీ జట్టు 9.1 ఓవర్లలో 33 పరుగులకే ఆలౌటైంది. ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు జయరామ్ 3, సాయి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 4.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. జట్టులోని జయరామ్ 20 పరుగులు చేశాడు. కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

శ్రీహరి డిగ్రీ కళాశాల గెలుపు


కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు

కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–3లో కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు, కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన శ్రీహరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అన్నమాచార్య జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. జట్టులోని శ్రీనివాసరెడ్డి 20 పరుగులు చేశాడు. శ్రీహరి బౌలర్లు మౌలాలి 3, దీపక్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి జట్టు 5.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 46 పరుగులు చేసింది. జట్టులోని అమానుల్లా ఖాన్ 21 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు 9 వికెట్లతో విజయం సాధించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

దూర విద్య

■ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా దూర విద్య విధానంలో డిగ్రీ, P.G. అడ్మిషన్లు జరుగుచున్నవి. చివరి తేది: 25-02-2023, శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్, పులివెందుల. సెల్ నెం.9059773738-40. [C-1161394]

MOBILE REPAIR

■ ఉచిత శిక్షణ: Mobile Repair Course (5G), C.C.Camera Training, Govt.Quota 20 అడ్మిషన్లు ఉచితం+Scholarship దూరప్రాంతాల వారికి Sunday Classes. Kadapa: 9542606074. [H-792587]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V- 5625]

LOSS OF PASSPORT

■ I, SHAIK MAHAMMAD S/o SHAIK MAHAMMAD GOUSE, D.No. 14/371-11, Khaleel Nagar, Kadapa(A.P). I am the Holder of Passport bearing No.R3011491. The Said Passport was lost while Shifting from my home to another home [C-1161871]

CHANGE OF NAME

■ I, MITAIGAR SYED KHAJAPEER SAHEB S/o MITAIGAR SYED KHADER MOHIDDIN SAHEB (Old Name), Change My name as MITHAIGAR KHAJA PEER S/o MITAIGAR SYED KHADER MOHIDDIN SAHEB (New Name), D.No.6-195-2, Addwarlveedi, Tadpatri, Anathapuram. [C-1161872]

■ I, PATAN GHOUSE KHAN H/o MAYANA GAOUSIA R/oF D.No.5/86-1(UP), Bacharao Street, Kadapa, YSR(Di), A.P. Now I Change My Name as MAYANA GHOUSE AHAMAD KHAN H/o MAYANA GOUSIA(New Name). [C-781338]

■ I, PATAN MAYAN GHOUSIYA W/o PATAN GHOUSE AHAMAD KHAN R/oF D.No.5/86-1(UP), Bacharao Street, Kadapa, YSR(Di), A.P. Now I Change My Name as MAYANA GAOUSIA W/o MAYANA GHOUSE AHAMAD KHAN (New Name). [C-781336]

■ I, PULLA AMEER BASHA S/o PULLA SALAM MUSLIM(PASSPORT No.K3652390) R/oF D.No.4/144, SARVARKANPET, PULLURU, KHAZIPET, YSR KADAPA(D), A.P. Now I Change My Sur Name and My Father name also POLLA AMEER BASHA S/o POLLA ABDULSALAM (New Name). [C-781339]

BUSINESS OFFER

■ మీ సొంత ఊరిలో వ్యవసాయరంగ ఉత్పత్తులు అమ్ముటకు Outlet Franchise అవకాశం కలదు. ఒక సంవత్సరం అగ్రిమెంట్, రెంట్, మెయింటినెన్స్ ఇవ్వబడును. సంప్ర: 86867 58515. [NA-5301]

■ కడప జిల్లాలో ప్రముఖ టెలికామ్ సర్వీసెస్‌కు ఛానల్ పార్టనర్స్ కావలెను. పెట్టుబడి ప్రైమ్ లొకేషన్‌లో కమర్షియల్ రూమ్ ఉన్నవారు సంప్ర: 9848102327 [T-1957]

WANTED

■ డా॥ క్రిష్టాస్ లైఫ్ హాస్పిటల్, రాజంపేట నందు పనిచేయుటకు సిస్టర్‌లు, ఫార్మసిస్ట్‌లు, రిసెప్షనిస్ట్‌లు, ఆయాలు వెంటనే కావలెను. Cont: 9160202888, 9441132453. [C-1161829]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 16K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 7569955551, 9848571888. [H-786829]

■ ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్ (అన్‌రోల్) 36 మంది కావలెను. జీతం, 20,000–25,000 అర్హత డిగ్రీ (50%) వయస్సు 25 సం॥లోపు ✆ 81424 20505, 81252 67363. [O-758380]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-10072]

■ ఈవెంట్ మెనేజ్‌మెంట్ లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ. 25K to 39K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెస్యూమ్ పంపండి వాట్సాప్ 6281159171. [HA-28601]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190562]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై సంప్ర॥ 7815811791 [G-779871]

■ ప్రముఖCorporate Bank అనుబంధ సంస్థ నందు పనిచేయుటకు Rtd.Emp., VRS, Senior Civtizen కావలెను. సంప్రదించండి సెల్: 9505850438. [T-1936]

■ మీ ఇంటి వద్దనే వుంటూ మా కంపెనీ ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్: 76748 10229 [V- 6029]


■ కార్పొరేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు కలవు. Any Degree, జీ: 20,000 పైన (అనుభవం ప్రకారం), వయస్సు:30సం.లోపు. 82977 97197. [T-1928]

■ తిరుపతిలో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ఇంట్లో పనిచేయుటకు వంట మనుషులు కావలెను. సంప్ర: 7429997999. [T-775]

■ VIP's ఇంట్లో పేషెంట్ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ, 10-30 వేల జీతం, భో॥వ ఫ్రీ, Hyd, Ph: 7995984445 [HA-935]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010224479
9010223797
9705898007

రాళ్లు కర్రలతో దాడులు : ఇద్దరికి తీవ్ర గాయాలు

ఖాజీపేట : ఇంటి ముందు వర్షపు నీరు నిలుస్తోందని.. కసువు వేస్తున్నారని ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకుని తీవ్ర గాయాల పాలయ్యారు.. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం సుంకేశుల గ్రామంలోని వెంకటరెడ్డి, రాములమ్మ ఇళ్లు ఒకే వీధిలో ఎదురెదురుగా ఉన్నాయి. వీరి మధ్య తరచుగా వర్షపు నీరు నిలుస్తోందని, ఇంటి ముందు కసువు వేస్తున్నారని గొడవలు జరిగేవి. బుధవారం ఈ గొడవ పెద్దదిగా మారింది. రాములమ్మ, వెంకటరెడ్డి కుటుంబీకులు ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో వెంకటరెడ్డి కాలు పూర్తిగా విరిగింది.. రాములమ్మకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి





రక్తదానం చేసిన ఉద్యోగులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతుడైన ప్రతి వ్యక్తి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని ఏపీ ఎస్ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఏరియా ఆస్పత్రిలో 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పలు సందర్భాల్లో సరైన సమయంలో రక్తం లభించక అనేక మంది తమ ప్రాణాలు కోల్పోయారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం జిల్లాలోని కడప డిపోకు చెందిన 16, పులివెందుల 6, బద్వేలు 2, ప్రొద్దుటూరు 10, జమ్మలమడుగు 7, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట డిపో నుంచి 4, రాయచోటి డిపోకు చెందిన ఏడుగురు కలిపి మొత్తం 52 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ తరుపున సాయిగ్రేస్ వారికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కడప డీపీటీఓ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, వీఅండ్ఎస్ఓ ముజుబుర్ రెహ్మాన్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కొమారి దావీదు(28) మృతి చెందాడు. ఏఎస్ఐ రాజశేఖరరెడ్డి కథనం మేరకు కలసపాడు మండలం ఎగువ రామాపురానికి చెందిన దావీదు అలియాస్ రవితేజ తమ్ముడిని పోరుమామిళ్లలో వదిలిపెట్టేందుకు ఓబులేసు అనే వ్యక్తి కలిసి ద్విచక్రవాహనంలో వచ్చారు.దావీద్ తమ్ముడిని వదిలిపెట్టిన తర్వాత తిరిగి బయలుదేరారు.స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బైక్ ఆపి మాట్లాడుకుంటుండగా ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈప్రమాదంలో దావీద్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఓబులేసు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దావీద్ బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య సునంద, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీగదిలో ఇద్దరు వృద్ధులు, ఒక మహిళ మృతదేహాలున్నాయి. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన మూడు మృతదేహాలను వారి బంధువుల కోసం బాడీఫ్రీజర్‌లలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: 25వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్స్ స్పోర్ట్, గేమ్స్ బాలబాలికల పోటీలు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, సాంకేతిక విద్యా కమిషనర్ సి.నాగరాణి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులు తొలుత క్రీడా జ్యోతితో మైదానంలో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ముఖ్యకార్యదర్శి సౌరభ్‌గౌర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో 1600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అనంతరం వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ఆడి పోటీలను ప్రారంభించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


కార్తీక్ కుమార్‌రెడ్డి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బైపాస్‌రోడ్డులోని అంజనాద్రినగర్‌లో నివాసం ఉంటున్న మన్నె కార్తీక్ కుమార్‌రెడ్డి (27) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు. రామసుబ్బారెడ్డికి మురళీధర్‌రెడ్డి, కార్తీక్ కుమార్‌రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఆర్మీలో పని చేస్తుండగా రెండో కుమారుడు కార్తీక్ కుమార్‌రెడ్డి కారు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. కొన్ని రోజుల నుంచి కార్తీక్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం డబ్బు ఇవ్వమని తల్లిదండ్రులను బెదిరించేవాడు.డబ్బు ఇవ్వకుంటే ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వమని కార్తీక్ గొడవ చేయగా లేదని తండ్రి చెప్పాడు. దీంతో అతను కోపంతో బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎప్పటి లాగే అతను ఇంటికి తిరిగి వస్తాడని అందరూ భావించారు. రాత్రి పొద్దుపోయినా రాలేదు. బుధవారం ఉదయం కార్తీక్ ఇంటికి ఫోన్ చేసి ఆచార్లకాలనీకి ఎదురుగా ఉన్న వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకుంటున్నాని చెప్పాడు. 'తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దు.. మేమొస్తున్నాం' అని చెప్పి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లారు. అప్పటికే కార్తీక్ ఒక చెట్టుకు ఉరేసుకున్నాడు. వెంటనే అతన్ని కిందికి దించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించాడు. తండ్రి రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

'టాలెంట్ హంట్'కు విశేష స్పందన


ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఆధ్వర్యంలో బుధవారం కడప కడపలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ నెట్స్ కేంద్రంలో నిర్వహించిన 'టాలెంట్ హంట్'కు విశేష స్పందన లభించింది. సీఏవైడీ జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఫాస్ట్ బౌలర్ల కోసం నిర్వహించిన ఈ టాలెంట్‌హంట్‌కు జిల్లావ్యాప్తంగా 110 మంది క్రీడాకారులు హాజరై బౌలింగ్ ప్రదర్శన చేశారు. వీరిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి 35 మందిని క్యాంపునకు ఎంపికచేసినట్లు క్రికెట్ సంఘం ప్రతినిధులు తెలిపారు. వీరిలో 125 కి.మీ/గంటకు వేసిన ఎస్. మహమ్మద్ ఆదిల్‌ను క్రికెట్ సంఘం ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ అకాడమీ కన్వీనర్ పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పృథ్వీ, జిల్లా క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఖాజామైనుద్దీన్, రంజీ మాజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్, ఈసీ మెంబర్లు నాగేంద్రస్వామి, ఎల్.మునికుమార్‌రెడ్డి, విష్ణుమోహన్ రావు, అబుబకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

జేసీ సాయికాంత్‌వర్మ



కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీరిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యవస్థ, నిర్మూలనపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా కడపను తీర్చిదిద్దాలన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు దాటిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వివాహాలు జరిపించాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాల కట్టడితో మాతా శిశు మరణాలు తగ్గించవచ్చని ఆయన వివరించారు. జిల్లాలోని సచివాలయాల పరిధిలో మహిళా పోలీసుల సహకారంతో రిజిష్టర్ నిర్వహించి తప్పక వివాహాలను నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు వివాహం నిశ్చయమైందని తెలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సచివాలయ పరిధిలో ఉన్న వలంటీర్లు తమ ఇళ్ల పరిధిలో పెళ్లిళ్ల సమాచారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి పరిధిలో మైనర్లకు వివాహాలు జరిగితే వలంటీర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. స్కూలు డ్రాపౌట్స్‌లో బాల్య వివాహాలు జరిగితే ప్రధానోపాధ్యాయులు, ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, ఆలయాలు, చర్చిలు, షాదీఖానాల ఎదుట బాల్య వివాహాల నిషేధంపై హెచ్చరికల ఐరన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, మెప్మా పీడీ రామ్మోహన్ రెడ్డి, డీఎంహెచ్ఓ నాగరాజు, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమాధికారి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ అలాగే కలెక్టరేట్‌లోని డీడబ్ల్యుఎంఏ సమావేశ మందిరంలో ముస్లిం మత పెద్దలతో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కృష్ణ కిశోర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌-19 ప్రపంచకప్‌ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్‌ చేతుల మీదుగా అండర్‌-19 జట్టు కెప్టెన్‌ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్‌'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.





గిల్‌

గిల్‌ జిగేల్‌...

- భారత ఓపెనర్‌ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్‌ సొంతం

అహ్మదాబాద్‌: మోదీ స్టేడియంలో భారత్‌ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' శుబ్‌మన్‌ గిల్‌ (63 బంతుల్లో 126 నాటౌట్‌; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్‌ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్‌ గెలుచుకుంది. మొదట భారత్‌ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్‌ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్‌ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద సిరీస్‌' హార్దిక్‌ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్‌ విధ్వంసం

ఇషాన్‌ కిషన్‌ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్‌, త్రిపాఠి కివీస్‌ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్‌ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్‌ (13 బంతుల్లో 24; 1 ఫోర్‌, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్‌ స్కోరు 156/3. శుబ్‌మన్‌ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్‌ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్‌ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్‌... లిస్టర్‌, టిక్నర్‌, ఫెర్గూసన్‌ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్‌ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్‌ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్‌) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్‌ పేస్‌కు కివీస్‌ బ్యాటర్స్‌ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్‌ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్‌ విజయానికి బాటపడింది. మిచెల్‌, సాన్‌ట్నర్‌ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.

స్కాన్‌ చేయండి
ఈ రోజు హైలైట్‌ కొరకు

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్‌ గిల్‌ (126 నాటౌట్‌) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్‌; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్‌ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్‌ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్‌ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్‌ రాహుల్‌, రోహిత్‌, కోహ్లి ఈ ఘనత సాధించారు.

స్కోరు వివరాలు

భారత్‌ ఇన్నింగ్స్‌: ఇషాన్‌ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్‌ 1; గిల్‌ (నాటౌట్‌) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్‌ (బి) సోధి 44; సూర్యకుమార్‌ (సి) బ్రేస్‌వెల్‌ (బి) టిక్నర్‌ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్‌ (బి) మిచెల్‌ 30; హుడా (నాటౌట్‌) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్‌: లిస్టర్‌ 4-0-42-0, బ్రేస్‌వెల్‌ 1-0-8-1, ఫెర్గూసన్‌ 4-0-54-0, టిక్నర్‌ 3-0-50-1, ఇష్‌ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్‌ 4-0-37-0, మిచెల్‌ 1-0-6-1.

న్యూజిలాండ్‌ ఇన్నింగ్స్‌: అలెన్‌ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్‌ 1; చాప్‌మన్‌ (సి) ఇషాన్‌ (బి) అర్ష్‌దీప్‌ 0; ఫిలిప్స్‌ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్‌ (సి) మావి (బి) ఉమ్రాన్‌ 35; బ్రేస్‌వెల్‌ (బి) ఉమ్రాన్‌ 8; సాన్‌ట్నర్‌ (సి) సూర్య (బి) మావి 13; ఇష్‌ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్‌ (సి) ఉమ్రాన్‌ (బి) పాండ్యా 0; టిక్నర్‌ (సి) ఇషాన్‌ (బి) పాండ్యా 1; లిస్టర్‌ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్‌) 66.** **వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్‌:** హార్దిక్‌ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్‌ సింగ్‌ 3-0-16-2, ఉమ్రాన్‌ మాలిక్‌ 2.1-0-9-2, కుల్దీప్‌ యాదవ్‌ 1-0-12-0, శివమ్‌ 2-0-12-2.



సిరీస్‌ ట్రోఫీతో కెప్టెన్‌ హార్దిక్‌

ఆంధ్ర 379 ఆలౌట్‌

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్‌ చేసిన విహారి



విహారి

ఇండోర్‌: డిఫెండింగ్‌ చాంపియన్‌ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్‌ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్‌ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్‌ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్‌ రెండు వికెట్లు తీయగా... నితీశ్‌ కుమార్‌ రెడ్డి, పృథ్వీరాజ్‌ ఒక్కో వికెట్‌ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్‌ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్‌ (149; 18 ఫోర్లు, 1 సిక్స్‌) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్‌ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్‌ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్‌ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్‌ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్‌ లలిత్‌ మోహన్‌ (22 నాటౌట్‌; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్‌ జైన్‌ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ ముగిసింది.

జాతీయ స్కూల్స్‌ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు



యశ్వి జైన్‌

సాక్షి, హైదరాబాద్‌: జాతీయ స్కూల్స్‌ చెస్‌ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్‌-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్‌ విఘ్నేశ్‌ (7.5 పాయింట్లు)... అండర్‌-15 బాలికల విభాగంలో యశ్వి జైన్‌ (7 పాయింట్లు)... అండర్‌-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్‌-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్‌-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్‌-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్‌ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్‌-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్‌ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్‌ సంఘం అధ్యక్షుడు కేఎస్‌ ప్రసాద్‌ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్‌



బ్యాంకాక్‌: థాయ్‌లాండ్‌ ఓపెన్‌ సూపర్‌-300 బ్యాడ్మింటన్‌ టోర్నీలో హైదరాబాద్‌ ప్లేయర్‌ సాయిప్రణీత్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్‌ 21-13, 21-14తో మాడ్స్‌ క్రిస్టోఫర్సన్‌ (డెన్మార్క్‌)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్‌ జార్జి (భారత్‌) 21-17, 19-21, 23-21తో చెయుక్‌ యి లీ (హాంకాంగ్‌)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్‌ వర్మ, ప్రియాన్షు రజావత్‌, మిథున్‌ మంజునాథ్‌ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్‌ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్‌ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్‌ (చైనా) చేతిలో.. మిథున్‌ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్‌) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్‌ డబుల్స్‌ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్‌ కపూర్‌ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్‌-జోసెఫిన్‌ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరింది.

సినిమా



● రజనీకాంత్‌

జైసల్మేర్‌లో జైలర్‌

రాజస్తాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్‌'. రజనీకాంత్‌ హీరోగా నెల్సన్‌ దిలీప్‌కుమార్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్‌'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్‌ కుమార్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్‌ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్‌' చిత్ర యూనిట్‌ ఇప్పుడు 'జైసల్మేర్‌'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్తాన్‌లో ల్యాండ్‌ అయ్యారు రజనీకాంత్‌. ఈ షెడ్యూల్‌ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్‌ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్‌ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...



● కమల్‌హాసన్‌

హెలికాప్టర్‌లో షూటింగ్‌ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్‌. 1996లో హీరో కమల్‌హాసన్‌, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్‌' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్‌ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్‌. కాగా కమల్‌ హెలికాప్టర్‌ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్‌, షూటింగ్‌ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్‌ ఇలా హెలికాప్టర్‌ రైడ్‌ చేస్తున్నారన్నది కోలీవుడ్‌ టాక్‌. కాజల్‌ అగర్వాల్‌ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్‌, రకుల్‌ప్రీత్‌సింగ్‌, బాబీ సింహా కీ రోల్స్‌ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.

పల్లెటూరి ప్రేమ



● 'శశివదనే'లో ఓ దృశ్యం

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌ లుక్‌ను 'దిల్‌' రాజు విడుదల చేశారు. వైభవ్‌ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్‌ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్‌ అసిస్టెంట్‌ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్‌ లవ్‌ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

- శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌. అనిఖా సురేంద్రన్‌, సూర్య వశిష్ఠ, అర్జున్‌ దాస్‌ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్‌ టి.రమేష్‌ మాట్లాడుతూ– ''రామ్‌ గోపాల్‌ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్‌ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్‌ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్‌ పాయింట్‌ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.



● శౌరి చంద్రశేఖర్‌



● విజయ్‌, త్రిష

పదిహేనేళ్ల తర్వాత....

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్‌– హీరోయిన్‌ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్‌ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్‌, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్‌ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్‌ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్‌ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్‌ ప్రకటించింది. దీంతో విజయ్‌, త్రిష ఐదోసారి స్క్రీన్‌ షేర్‌ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్‌' తర్వాత హీరో విజయ్‌, దర్శకుడు లోకేష్‌ కనగరాజ్‌ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్‌ దత్‌, ప్రియా ఆనంద్‌, అర్జున్‌ సర్జా, గౌతమ్‌ మీనన్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్‌.

వింతగా మారబోతోంది



● బ్రహ్మానందం

తరుణ్‌ భాస్కర్‌ దాస్యం దర్శకత్వంలో భరత్‌ కుమార్‌, శ్రీపాద్‌ నందిరాజ్‌, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్‌ కౌశిక్‌, సాయికృష్ణ గద్వాల్‌, విజయ్‌ కుమార్‌ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్‌ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్‌ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్‌ భాస్కర్‌.

తెరపైకి జాక్సన్‌ జీవితం



● మైఖేల్‌



● జాఫర్‌

పాప్‌ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్‌ జాక్సన్‌ జీవితంతో 'మైఖేల్‌' పేరుతో బయోపిక్‌ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్‌ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్‌ కుమారుడు జాఫర్‌ జాక్సన్‌ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్‌ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్‌. ''మైఖేల్‌ జాక్సన్‌ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్‌ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్‌ జాక్సన్‌ 2009 జూన్‌ 25న మరణించిన విషయం తెలిసిందే.

లవ్‌.. యాక్షన్‌



● రక్షిత్‌, కోమలి

రక్షిత్‌ అట్లూరి, కోమలీ ప్రసాద్‌ జంటగా సాయి మోహన్‌ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్‌ కానుంది. శరవణ వాసుదేవన్‌ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్‌ సాంగ్‌ని డైరెక్టర్‌ హరీష్‌ శంకర్‌ రిలీజ్‌ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్‌, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్‌, యాక్షన్‌ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్‌. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: శ్రీపాల్‌ చోలేటి, కెమెరా: సాయికుమార్‌.

అయోమయంలో...



● రణధీర్‌, శుభశ్రీ

రణధీర్‌, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్‌ ప్రసాద్‌ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్‌ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్‌ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్‌ క్రైమ్‌ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్‌ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్‌, సంగీతం: శివ కాకాని.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 98481 50278, RNI Regn No. APTEL/2008/23796. Reproduction in Whole or in Part Without Written Permission of The Publisher is Prohibited